నేటి నుంచి సమన్వయ్‌ ఫెస్ట్‌

కుత్బుల్లాపూర్‌: శివ శివాని ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌లో బుధవారం నుంచి గురువారం వరకు 26వ సమన్వయ్‌ ఫెస్ట్‌ నిర్వహించనున్నట్లు విద్యా సంస్థ ప్రెసిడెంట్‌ ఆర్తీ సంపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమన్వయ్‌ మేనేజ్‌మెంట్‌ ఫెస్ట్‌కు సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈవెంట్‌ విజేతకు రూ.50 వేల నగదు బహుమతి శ్రేష్ఠ ది యంగ్‌ మేనేజర్‌ ద్వారా ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అన్ని ఈవెంట్‌లలో గెలుపొందిన కళాశాలలకు సత్రాజ్‌ ఆఫ్‌ సమన్వయ్‌ ట్రోఫీని బహూకరిస్తారని తెలిపారు. మొదటి రోజు ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌ సూరంపూడి, జనరల్‌ మేనేజర్‌, హెచ్‌ఆర్‌ అండ్‌ రీజనల్‌ హెడ్‌ హెచ్‌ఆర్‌లు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజును సన్మానిస్తున్న ప్రతినిధులు

దుండిగల్‌: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌ రాజు అన్నారు. శంభీపూర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. అదేవిధంగా శంభీపూర్‌ రాజుపై దుండిగల్‌ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌ మహిళా అధ్యక్షురాలు మనోజా రూపొందించిన నూతన పాటను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుండిగల్‌: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దబుద్దుల సతీష్‌ సాగర్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం తహసీల్దార్‌ మతిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల లోగా బీసీ కుల గణన పూర్తి చేసి, జనాభా నిష్పత్తి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి బీసీలను మభ్యపెట్టి గెలిచారన్నారు. హామీని విస్మరిస్తున్న కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, సీనియర్‌ నాయకులు పీసరి కృష్ణారెడ్డి, శివాజీ రాజు, జనార్దన్‌ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే



వెన్నెలగడ్డలో సర్వే చేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్‌: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాల దరఖాస్తుదారుల ఇంటింటి సర్వే ముమ్మరంగా జరుగుతుంది. జీడిమెట్ల డివిజన్‌ వెన్నలగడ్డలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంగళవారం అధికారులు సర్వే నిర్వహించారు. సేకరించిన వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్లో పొందు పరుస్తున్నారు. చాలామంది డోర్‌ లాక్‌ ఉండడంతో పదేపదే తిరగాల్సి వస్తోందని సిబ్బంది పేర్కొన్నారు.

చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జీడిమెట్ల: కైట్స్‌ షాపుల్లో చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ గడ్డం మల్లేష్‌ అన్నారు. మంగళవారం జీడిమెట్ల పీఎస్‌ పరిధిలోని పలు కైట్స్‌ షాపుల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. పక్షులు, ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించే చైనా మాంజాను అమ్మవద్దని దుకాణదారులకు సూచించారు. ఒకవేళ అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఏళ్లు గడుస్తున్నా ఎదురు చూపులే!

ఏళ్లు గడుస్తున్నా మహిళా భవనాల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. డివిజన్‌ పరిధిలో చెన్నారెడ్డి నగర్‌లో, గాంధీనగర్‌ వార్డు కార్యాలయంలో పుటింగ్‌, బేస్‌మెంట్‌ వరకు చేసి కాంట్రాక్టర్లు పనులు వదిలిపెట్టారు. వెంకట్రామిరెడ్డి నగర్‌లో భవనం పూర్తైన మౌలిక వసతులు లేక నిరుపయోగంగా మారింది. ఎక్కడ కూడా మహిళా భవనం అందుబాటులోకి రాలేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొన్ని చోట్ల బిల్లులు తీసుకుని పూర్తి చేయకుండా పత్తా లేకుండా పోయారు. అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులను గాలికి వదిలేయడంతో మహిళా భవనాల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతాయని స్థానిక మహిళా సంఘాల వారు ఎదురు చూస్తున్నారు. – రంగారెడ్డినగర్‌

పూర్తికాని మహిళా సంఘాల భవనాలు



గాంధీనగర్‌లో బేస్‌మెంట్‌కే పరిమితమైన మహిళా భవన నిర్మాణం

- డివిజన్‌లో మూడు ప్రాంతాల్లో నిర్మాణం
- రెండు చోట్ల మధ్యలోనే ఆగిన పనులు
- మరోచోట వసతులు లేక నిరుపయోగం

పుటింగ్‌లతో సరిపెట్టి..

చెన్నారెడ్డినగర్‌లో మహిళా భవన నిర్మాణానికి 2018లో రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌ పుటింగ్‌ల వరకు పూర్తి చేసి నిధులు సరిపోవంటూ చేతులెత్తేశాడు. అయితే భవన నిర్మాణ ప్రాంతాన్ని పెంచాలని స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్‌ పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో గత ఎనిమిదేళ్లుగా మహిళా భవన నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు తమ కార్లకు పార్కింగ్‌గా ఉపయోగిస్తున్నారు.

పూర్తైనా వసతులు కరువు

వెంకట్రామిరెడ్డినగర్‌లోని మహిళా భవనాన్ని ఐదేళ్లుగా సాగదీసిన కాంట్రాక్టర్‌ సాక్షిలో ప్రచురితమైన కథనాలతో ఎట్టకేలకు ఇటీవల పూర్తి చేశాడు. అయితే భవనంలో విద్యుత్‌ సదుపాయం, తాగునీటి వసతి, డ్రైనేజీ, ఫ్లోరింగ్‌, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్‌లు వంటివి ఏర్పాటు చేయకపోడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం భవనానికి తాళం వేయడంతో మహిళలు సమావేశాలు, ఇతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి వీలు లేకుండా పోయింది. ఈ విషయమై పలుమార్లు జీహెచ్‌ఎంసీ కార్యాలయం చుట్టూ తిరిగినా అదిగో.. ఇదిగో అంటూ అధికారులు చెబుతున్నారే తప్ప పనులు పూర్తి చేయడం లేదని మహిళా సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

బేస్‌మెంట్‌తో సరి..

గాంధీనగర్‌ వార్డు కార్యాలయంలో ఎదురుగా పాత కమిటీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగింది. అది శిథిలావస్థకు చేరడంతో 2022లో అధికారులు దానిని నేలమట్టం చేశారు. ఈ ప్రాంతంలో మహిళా భవనం నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ బేస్‌మెంట్‌, పిల్లర్ల వరకు పూర్తి చేసి ఆపై పత్తా లేకుండా పోయాడు. ఈ విషయమై సాక్షి సంబంధిత అధికారులను వివరణ కోరగా.. ఒకసారి అసెంబ్లీ ఎన్నికలు, మరోసారి లోక్‌సభ, ఇంకోసారి ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ వల్ల పనులు ఆగిపోయాయని, త్వరలోనే పూర్తి చేస్తామని చెబుతూ కాలం వెళ్లదీశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా నేటికి మహిళా భవనం పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం అందులో పారిశుద్ధ్య రిక్షాలు, సామగ్రిని ఉంచడం గమనార్హం.



చెన్నారెడ్డినగర్‌లో మహిళా భవన స్థలంలో వాహనాల పార్కింగ్‌



వెంకట్రామిరెడ్డినగర్‌లో వసతులు లేక నిరుపయోగంగా ఉన్న భవనం

రాత్రికి రాత్రే సిమెంట్‌ రోడ్డు

- కౌన్సిల్‌ తీర్మానం లేకుండా ఏర్పాటు
- అధికారులను నిలదీసిన నేతలు
- తమకు తెలియదంటున్న అధికారులు
- సీసీ రోడ్డును పరిశీలించిన అఖిలపక్ష నాయకులు



రోడ్డును పరిశీలిస్తున్న అఖిలపక్ష నేతలు

కుత్బుల్లాపూర్‌: కౌన్సిల్‌ తీర్మానం లేకుండానే ఓ రోడ్డు పనులు రాత్రి చకచక జరిగిపోయాయి. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డు అపర్ణ ఫార్మ్‌ కాలనీ ఫేజ్‌ 3లో 2024 డిసెంబర్‌ 25న రాత్రి 12 గంటల సమయంలో సుమారు 420 మీటర్ల పొడుగు 20 వెడల్పుతో ఓ కాంట్రాక్టర్‌ రోడ్డు నిర్మాణం పూర్తి చేశాడు. ఇదే విషయంపై స్థానిక కౌన్సిలర్‌ శకుంతల కౌన్సిల్లో తీర్మానం లేకుండా అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా రోడ్డు వేయటం ఏమిటని మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీహరి, డీఈ నరేష్‌కు ఫోన్‌ చేసి అడిగారు. తనకు తెలియదని వారు చెప్పడం విశేషం. దీంతో కౌన్సిలర్‌ మున్సిపల్‌ బీజేపీ ఫ్లోర్‌ లీడర్‌ రాజిరెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్‌ గౌడ్‌ దష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో సదరు రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం గోపాల్‌ రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ శివాజీ రాజు, సతీష్‌ సాగర్‌, మధులతో కలిసి మున్సిపల్‌ కార్యాలయంలో డీఈని నిలదీశారు. ఆ రోడ్డు విషయం తనకు తెలియదని అధికారి బదులు ఇవ్వడం విశేషం. రెండు సంవత్సరాల క్రితం తీర్మానం అయిన పనులకే దిక్కు లేదని.. ఆగమేఘాలపై ఈ రోడ్డు పనులు ఎలా జరిగాయని అఖిలపక్షం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ.20 లక్షలు విలువ చేసే ఈ పనులు కౌన్సిల్‌ తీర్మానం లేకుండా, ఎస్టిమేషన్‌ చేయకుండా, టెక్నికల్‌ అప్రూవల్‌ లేకుండా, టెండర్‌ అగ్రిమెంట్‌ వంటివి చేయకుండానే పనులు చేయడంపై నాయకులు ఆరా తీస్తున్నారు. కలెక్టర్‌, సీడీఎంఏ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చింతల్‌: విద్యుత్‌ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఆయా సబ్‌ స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బోయినపల్లి ఏడీఈ శ్రీకాంత్‌ తెలిపారు. బోయిన్‌పల్లి సబ్‌ స్టేషన్‌ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పైప్‌ లైన్‌ రోడ్డు ఫీడర్‌ పరిధిలో ఫతేనగర్‌, శాస్త్రి నగర్‌, రైల్వే ట్రాక్‌ లైన్‌, శ్రీహరి బిల్డింగ్‌, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇండియన్‌ ఎయిర్‌ ఫోర్స్‌ ఫీడర్‌ పరిధిలో ఫతేనగర్‌, శాస్త్రి నగర్‌, పైపులైన్‌ రోడ్‌, భగత్‌ సింగ్‌ పార్క్‌, గవర్నమెంట్‌ హాస్పిటల్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

నిజాంపేట్‌: భౌరంపేట్‌ సబ్‌ స్టేషన్‌ నుంచి 11కేవీ కేవీఆర్‌ ఫీడర్‌లో బుధవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేవీఆర్‌ కాలనీ, స్ప్రింగ్‌వుడ్‌, జీఎస్‌ఎస్‌ విల్లాస్‌, స్టెర్లింగ్‌ హోమ్స్‌, ప్రణీత్‌ నేచర్‌ బౌంటీ, 11కేవీ భౌరంపేట్‌ విలేజ్‌ ఫీడర్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భౌరంపేట్‌ విలేజ్‌, ల్యాండ్‌ మార్క్‌2, కీర్తి హోమ్స్‌, అక్షయ్‌ డెవలపర్స్‌, బ్లూమ్స్‌, ప్రణీత్‌ మెడోస్‌, అలాగే బొల్లారం సబ్‌స్టేషన్‌ నుంచి 11కేవీ మల్లంపేట్‌ ఫీడర్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మల్లంపేట్‌ గ్రామం, హైరైజ్‌ విల్లాస్‌, ఏపీఆర్‌ విల్లాస్‌, జీవీసీ విల్లాస్‌, డ్రీమ్‌ వ్యాలీ కాలనీ, గ్రీన్‌ పార్క్‌ కాలనీ, ఆకాష్‌ లేఅవుట్‌, మారుతీ నగర్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ బి.సాయి కిరణ్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

జగద్గిరిగుట్ట: విద్యుత్‌ మరమ్మత్తుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌ అధికారులు మంగళవారం తెలిపారు. జగద్గిరిగుట్ట సబ్‌ స్టేషన్‌ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, చింతల్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలలకు అండగా నిలుద్దాం

జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా

సాక్షి,సిటీబ్యూరో:మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో బాలల రక్షణకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ (లోకల్‌ బాడీ) రాధికా గుప్తా కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆపరేషన్‌ స్మైల్‌ కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. 14 సంవత్సరాల లోపు ఉన్న బాలలను వివిధ పారిశ్రామిక వాడల్లో కార్మికులుగా పని చేయించినా లేదా భిక్షాటన చేయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్‌ హెచ్చరించారు. ఇందులో డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథ్‌ స్వామి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత, చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ మెంబర్‌ రామ్మోహన్‌, బాల రక్ష భవన్‌ కోఆర్డినేటర్‌ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎండి ఇంతియాజ్‌ రహీం, రెవెన్యూ, పోలీసు అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు, చైల్డ్‌ లైన్‌ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగభూషణం

చింతల్‌: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చింతల్‌కు చెందిన డాక్టర్‌ పెండెం నాగభూషణం ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అప్పం శ్రీనివాసరావు, సామల వెంకటేశం, ఒడిచేర్ల మారుతి, వల్లకాటి శ్రీను, విష్ణు, గోవర్ధన్‌, ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుత్బుల్లాపూర్‌: వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లిలోని అనూ ఫర్నిచర్‌ ఎదురుగా ఉన్న ఫ్లై ఓవర్‌ రోడ్డులో ఓ వ్యక్తి పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సదరు వ్యక్తిని పరిశీలించగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతని నడుము భాగంలో రక్తమరకలు, గాయం ఉండటంతో ఏదైనా వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. అతని వయస్సు 50 సంవత్సరాల వరకు ఉంటుంది. ఇతర వివరాలు తెలియలేదని పేర్కొన్నారు. ఎవరైనా మృతుడి వివరాలు తెలిసిన వారు 9490617229, 8712663248 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సుభాష్‌నగర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి వెళ్లే దారిలో కూరగాయల మార్కెట్‌ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు లభ్యం కాలేదు. అతని వయస్సు 55 సంవత్సరాలు ఉంటుంది. చెత్త కాగితాలు ఏరుకుంటూ భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉండొచ్చని, అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్‌: ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, వారికి సహకరించాలని అధికారులకు ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మంగళవారం వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. అనంతరం ఆయన అధికారులకు ఫోన్‌ చేసి పరిష్కరించాలన్నారు. ఆయా కాలనీల నుంచి వచ్చే ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం సంక్షేమ సంఘాల నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

దుండిగల్‌: డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌ అన్నారు. పేట్‌ బషీరాబాద్‌ లోని క్యాంప్‌ కార్యాలయంలో డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల సముదాయ లబ్ధిదారులు మంగళవారం కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల సముదాయాల వద్ద ఇప్పటికే మౌలిక వసతులతో పాటు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇతర సదుపాయాలను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్‌, జక్కుల విజయ శ్రీనివాస్‌ యాదవ్‌, గోపాల్‌ రెడ్డి, పీఏసీఎస్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ నల్తూరి కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే సత్ఫలితాలు



మొబైల్‌ స్క్రీనింగ్‌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్‌ రఘునాథ స్వామి

దుండిగల్‌: మహిళల్లో అధికంగా కనిపించే రొమ్ము కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి. రఘునాథస్వామి అన్నారు. గ్రాన్యూల్స్‌ ఇండియా లిమిటెడ్‌, ఏజీజీ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో గాగిల్లాపూర్‌లో 'బ్రెస్ట్‌ హెల్త్‌ ఎక్స్‌ప్రెస్‌' మొబైల్‌ బ్రెస్ట్‌ క్యాన్సర్‌ స్క్రీనింగ్‌, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో మహిళలకు అధునాతన రొమ్ము కేన్సర్‌ స్క్రీనింగ్‌ సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. గ్రాన్యూల్స్‌ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బ్రెస్ట్‌ హెల్త్‌ ఎక్స్‌ప్రెస్‌ కార్యక్రమాన్ని విస్తరించడానికి కట్టుబడి ఉన్నామని, గ్రామీణ వర్గాలకు సైతం స్క్రీనింగ్‌ సేవలను తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు. మహిళలు ఆర్థికంగా, మానసికంగా కృంగిపోకుండా వారి సంరక్షణ తమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో రొమ్ము కేన్సర్‌ కేసులు ఉన్న దేశంలో భారతదేశం ఒకటని, యువతలోనూ ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ముందస్తుగా గుర్తించి వ్యాధి నివారణే ముఖ్యంగా పని చేస్తున్నామని యూసీ బ్రెస్ట్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు, ప్రముఖ అంకాలజిస్ట్‌ ప్రజ్ఞ చిగురుపాటి అన్నారు. కార్యక్రమంలో గ్రాన్యూల్స్‌ ఇండియా లిమిటెడ్‌ ఫార్ములేషన్స్‌ హెడ్‌ అండ్‌ ప్రెసిడెంట్‌ రామ్‌రాజ్‌ రంగరాజులు, మల్కాజిగిరి డివిజన్‌ డిప్యూటీ డిస్ట్రిక్ట్‌ వైద్య శాఖ అధికారిణి డాక్టర్‌ శోభారాణి, ఇమ్యూనైజేషన్‌ అధికారిణి డాక్టర్‌ సరస్వతి, దుండిగల్‌ వైద్య అధికారిణి స్వర్ణలత, కౌన్సిలర్లు శంభీపూర్‌ కృష్ణ, కొర్ర శంకర్‌నాయక్‌, కుంటి అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్‌ ధనరాజ్‌ యాదవ్‌

నిజాంపేట్‌: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, ప్రతీ ఒక్కరు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్‌ ధనరాజ్‌ యాదవ్‌ సూచించారు. నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే కూరగాయల మార్కెట్‌ నిర్వహణ వల్ల పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం పారిశుద్ధ్య కార్మికులచే తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్‌ పరిధిలో రోడ్లు, పరిసరాలు, వివిధ సముదాయాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్‌ సూపర్‌ వైజర్లకు, సిబ్బందికి సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్యాచ్‌ వర్క్‌ పనుల సందర్భంలో కలిగే ఇబ్బందులను ప్రజలు వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుమార్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్‌ ఇంజనీర్‌ సుకృతారెడ్డి, సైట్‌ ఇంజనీర్‌ అరుణ్‌, ఫీల్డ్‌ ఇంజనీర్‌ శివ, సూపర్‌ వైజర్‌లు సురేష్‌, దశరథ్‌, సురేఖ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కార్మికులకు డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిజాంపేట్‌ : అర్హులైన పేదలకు, మున్సిపల్‌ కార్పొరేషన్‌లో పని చేసే పేద కార్మికులకు వెంటనే డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం నిజాంపేట్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా ఉండి సొంత భవనాలు ఉన్నవారికి డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు అందుతున్నాయని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో నర్సమ్మ, భాగ్యమ్మ, అమృత, సత్యమ్మ, యాదమ్మ, నాగమ్మ, దుర్గయ్య, గిరి, కృష్ణ, సురేష్‌, నర్సింహ, మున్సిపల్‌ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటారా?



కొంతమంది తుక్కు వ్యాపారులు రోడ్డుపై ప్లాస్టిక్‌ కవర్లను ఆరబెడుతూ వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఈ విషయమై ఎస్వీ కో ఆపరేటివ్‌ అధికారులు పట్టించుకుని రోడ్లపై ప్లాస్టిక్‌ కవర్లను ఆరబెట్టే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – జీడిమెట్ల